చూట్టం మొదలుపెట్టారు. ఒక పెద్ద తన చేతిలోని పొన్నుకర్రను వయ్యారంగా వూపుతూ తిన్నగా భద్రయ్య దగ్గరకువచ్చి అతని మెడలోని అట్టనుచూసి "వీరభద్రయ్య పూతరేకుల దుకాణం" అని చదువుకొని తనలో నవ్వుకున్నాడు.

తన ప్రక్కనే ఉన్నవారిని అందరినీ కూర్చోబెట్టి యిలా చెప్పడం మొదలుపెట్టాడు.

"మీతో ఒక విషయం, చాలా ముఖ్యమైన విషయం చెబుతున్నాను, శ్రద్ధగా వినండి, మొన్నటిదాకా మనఊళ్లో పూతరేకులు అమ్మినవాడు ఎవరనుకున్నారు? మనపక్క గ్రామంలోని వైష్ణవులు మన గ్రామంలో గుట్టుమట్లు అన్నీ కూపీతియడానికి పంపినవాడు. అంతేకాని మరోడు కాడు. అందుకనే పెద్దలందరమూ చేరి వాడ్ని మళ్ళీ ఇక్కడకు రాకుండా చేశాము ఈరోజున, యిక్కడ వున్న ఈ వీరభద్రయ్య, మన శైవుడు. అందుచేత, మీరందరూ వీరభద్రయ్యను అభిమానించాలి. రేపటినుంచి మనందరకు కావలసిన పూతరేకులను మనమతస్థుడు అయిన ఈ వీరభద్రయ్యే సప్లయి చేస్తుంటాడు. అందరూ ఇతనిదగ్గరే కొంటూ" ఉండాలని నామనవి... అంటూ కొన్ని పూతరేకులు కొనుక్కొని పోయాడా పెద్ద మనిషి.

భద్రయ్య పూతరేకుల బుట్ట చూస్తూ వుండగానే ఖాళీఅయిపోయింది. భద్రయ్య, ఖాళీబుట్టను ఊపుకుంటూ అమితానందంతో యింటికి చేరుకున్నాడు. ★

# ఎవరిదీ సూట్‌కేసు?

## వి. ఎస్. చెన్నాచారి

మేనల్లుడి కూతురి పెళ్ళిగ్గాను మద్రాసు వెళ్లిన పేర్రాజుగారు పెళ్ళిపూర్తయిన తరువాత ఓరోజు, అలా ఊరిమీదికి బయలుదేరారు. తిరిగితిరిగి మూర్ మార్కెట్టు చేరుకున్నారు పాత సామాన్లు అమ్మే దుకాణాల వద్దకొచ్చేసరికి ఓ పాత సూట్‌కేసు ఆయన కంటబడింది. పేర్రాజుగారు తన గుమాస్తాకి అల్లాంటి సూట్‌కేసొకటి కొనాలని చాలా రోజులుగా అనుకొంటూ ఉన్నారు కాని ఎప్పుడూ వీలుచిక్కింది కాదు. ఇది 'సెకెండ్ హేండ్' ది కాబట్టి చవుకగానే దొరకవచ్చు. అందుచేత యెలాగయినా కొనేయాలని నిశ్చయించుకున్నారు. బేరంచేసి చివరికి ఐదురూపాయలకి కొనేశారు.

మరునటిరోజు రాత్రిభోజనానంతరం, పైపంచా, పాతకోటూ, పెళ్ళింటివారు కట్టిచ్చిన ఫలహారాలూ, కొబ్బరికాయా అన్నీ సూట్‌కేసులో అమర్చి, మూతపెట్టి, తాళంవేసి, తాళం భద్రంగా బొడ్లోదోపుకుని, పెళ్లింటివారివద్ద సెలవు పుచ్చుకుని ఆయన ఊరికి ప్రయాణమయ్యారు. సెంట్రల్ స్టేషన్ చేరుకుని, టిక్కెట్టు కొనుక్కుని విశాఖపట్నం ప్యాసింజర్లో యెక్కి, సూట్‌కేసుని తన కెదురుగుండా సామాన్లు పెట్టుకునే బెర్తుమీద ఓ చివర పెట్టుకూర్చున్నారు. బండి కదిలే సమయానికి పెట్టెలో రద్దీ యెక్కువయింది.

బేసిన్ బ్రిడ్జిలో కాబోలు, జనాన్నితోసుకుని యిద్దరు వ్యక్తులు లోపలికి జొరబడ్డారు. అందులో ఒకరు బుష్‌కోటు వేసుకున్నారు. ఆ ఆసామీ చేతిలో ఓసూట్‌కేసు ఉంది. అది అచ్చం పేర్రాజుగారి సూట్‌కేసు లాంటిదే కాని, కొత్తది! విద్యుద్దీప కాంతిలో తళతళా మెరిసిపోతున్నది. ఆసూట్‌కేసు పేర్రాజుగారి సూట్‌కేసు మీద పెట్టి, కూచునేందుకు చోటులేకపోవటంచేత వారిద్దరు అలాగేనుంచున్నారు. బండి కదిలింది.

"ఎంత బావుంది! — కనీసం, పాతికరూపాయలు పెట్టందే అలాంటిది రాదు"— అని అనుకుంటూ, ఆ కొత్త సూట్‌కేసువేపే చూస్తూ ఉండిపోయారు పేర్రాజుగారు. పక్కస్టేషనులో కొందరు దిగిపోయ్యారు కొందరు ఎక్కారు. ఆ ఎక్కినవాళ్ళలో ఓఆసామీబండెడు లగేజీ పట్టుకొచ్చాడు. బెర్తుమీద లగేజీసర్దడంలో యీసూట్‌కేసులు రెండూ క్రిందుమీదయినై. ఇది ఒక్క పేర్రాజుగారు తప్ప మరెవ్వరూ గుర్తించలేదు.

ఆ కొత్తసూట్‌కేసు పట్టుకొచ్చినవ్యక్తులు అలా నుంచోలేక, యెక్కడేనా చోటుందేమో చూచిరావడానికాబోలు పొన్నేరిస్టేష

సులో దిగారు. చోటు దొరికినట్టుంది, బండి కదలబోతుండగా అందులో ఒక్కరు మాత్రం తిరిగొచ్చి పైనున్న సూట్ కేసుని పట్టుకెళ్లారు. అంటే తమ కొత్తసూట్ కేసును వదిలిపెట్టి, తొందర్లో పేరాజుగారి సూట్ కేసుని పట్టుకు పోయాడన్న మాట.

పేరాజుగారు ఇదంతా ఓకంట కనిపెడుతూనే ఉన్నారు కాని, అతగాణ్ణి హెచ్చరించిన పాపాన పోలేదు.

వాళ్లు తమలో తాము అరవంలో మాట్లాడుకొన్న దానిని బట్టి, దగ్గర్లోనే ఎక్కడో దిగిపోతారనీ, ఈ కాస్త వ్యవధిలో సూట్ కేసుని గుర్తుపెట్టగల అవకాశం ఉండదనీ, వాళ్లు దిగిపోయిన తరవాత కొత్త సూట్ కేసుమీద తనకు సర్వ హక్కులూ లభిస్తాయనీ పేరాజుగారికి తెలుసు. బండికదిలిన తరువాత మెల్లగా లేచి ఆసూట్ కేసుని కాస్త అవతలకు జరిపి చూచారు. బరువుగానే వుంది. మొత్తానికి ఆ రోజు నిద్రలేచి ఎవరి ముఖం చూశాసో నన్నుగొప్ప అదృష్టం వరించబోతున్నదని పేరాజుగారు లోలోపలే సంతోషించసాగారు.

పేరాజుగారు అనుకున్నట్టే బండి నాలుగయిదు స్టేషన్లు దాటినా సూట్ కేసుకోసం ఎవరూ రాలేదు. ఈపాటికి వాళ్ళెక్కడో దిగిపోయి ఉంటారనుకుని ఆయన సంతోషపడ్డారు.

బండి గూడూరుస్టేషను చేరుకున్నది. సూట్ కేసు పట్టుకొచ్చిన ఇందాకటి బుష్ కోటుఆసామీ పెట్టెలోకెక్కి ఆ కొత్తసూట్ కేసుని కూడా పట్టుకుపోసాగాడు. పేరాజుగారికి వళ్లుమండింది. చివ్వుక్కున లేచి,— "అడేఁమి టయ్యాయ్! అది మీది కాదు. మీది ఫలానా స్టేషనులో మీవాడొచ్చి పట్టుకు పోయాడు" అని వారించారు.

అతడు విసుగ్గా ముఖంచిట్లించి- "మావాడా?—ఎవడా మావాడు? —ఇంతకూ ఈసూట్ కేసు ఎవరిదంటావ్?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఇది నాదయ్యా బాబూ?"— అని పేరాజుగారు అందిపుచ్చుకో బోయేసరికి, ఇద్దరికీ ఘర్షణజరగడం అక్కడున్న 'నలుగురూ గుమిగూడ్డం జరిగింది.

పెట్టెలోకూచుని ప్రయాణం చేస్తోన్న పెద్దమనుషులు యిద్దరు ముగ్గురు అవునవును, అతనితో నుంచుని ఉండిన మనిషి 'ఫలానా' స్టేషనులో సూట్ కేసుని పట్టుకు పోయింది నిజమేనని సాక్ష్యం చెప్పారు. కాని, బుష్ కోటుఆసామీ మాత్రం-తనతో నుంచుడిన వ్యక్తికీ తనకీ ఎలాంటి సంబంధమూ లేదనీ, అతడెవడో తనకీ తెలియదనీ, ప్రస్తుతం యీసూట్ కేసు తనదే ననీ, కాబట్టి తనసూట్ కేసుని తనకివ్వడానికి అభ్యంతరపెట్టొద్దనీ వాదించాడు.

ఇంతలో ఓ పెద్దమనిషి "ఈ పెట్టె నాదంటే నాదని వాదించుకుంటున్నారు గదా, ఇందులో యేమేమున్నాయో మీకు జ్ఞాపకం ఉన్నంతవరకు ఎవరికి వారు జాబితా రాసి యివ్వండి. పెట్టె యెవరిదో యిట్టే తేలిపోతుంది."- అని అంటూ చెరో కాగితం పెన్సిలూ యిచ్చాడు. అక్కడ గుమిగూడిన పెద్దలందరూ ఈ పద్ధతి బావుంది అంటే బావుందన్నారు. జాబితా రాసి యివ్వడానికి యిద్దరూ ప్రథమంలో పేచీపెట్టినా ఒప్పుకోక తప్పింది కాదు. రెండు జాబితాలూ తయారయినై. పెట్టె తెరచిచూస్తే పేరాజుగారి జాబితాతో యెలాగూ సరిపోలేదు కదా, బుష్ కోటు ఆసామీ జాబితాతో కూడా సరి పోలేదు. అందరూ ఆశ్చర్యపోయారు. ఇంతలో అక్కడికో పెద్దమనిషి పోలీసు ఇన్ స్పెక్టర్ తో సహా ప్రత్యక్షమవడం, పెట్టెతనదే నని ఋజువు పరచడం జరిగింది.

ఆ ఆసామీ, సెంట్రల్ స్టేషను వెయిటింగ్ రూములో సూట్ కేసుని తలక్రింద పెట్టుకుని పడుకొని ఉంటే యెవడో దొంగవెధవ ఆ పెట్టెస్థానంలో మరో అట్టపెట్టె వుంచి అతిమెలకువగా ఆపెట్టెని కాస్తా కొట్టేసి జఫాయించాడనీ, ఆ పెట్టెనీ అందులోని సామాన్లనీ తాను మద్రాసులో కొనుగోలు చేశాననీ చెప్పాడు. వాటితాలూకు బిల్లులుకూడా చూపించాడు.

"ఇప్పుడు చెప్పండి, ఎవరిదీ సూట్ కేసు?" అని పోలీసు ఇన్ స్పెక్టర్ అడుగుతుంటే ఎవరూ మాట్లాడలేదు. ఇద్దరి ముఖాలూ మాడిపోయినై.

"పదండి స్టేషన్ కి అక్కడే చెప్పుకుందురుగాని" అని ఇన్ స్పెక్టరు బండిదించి, స్టేషన్ కి లాక్కుపోతుంటే, పేరాశకు పోయిన పేరాజుగారు పెట్టెకుపెట్టెపోగొట్టుకుని, దొంగఅయినందుకు తీరని అవమానంతో తల వంచుకున్నాడు. ఇంత సేపూ ఇందుకోసమే ఆగినట్టు కూతేసి, బరువుగా కదిలింది రైలు బండి. ★